క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం

పిచ్చాటూరు: క్రీడలతో మానసిక, శారీర కోల్లాసం పొందవచ్చని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం ఉదయం నాగలాపురంలో ఎన్‌వైసీసీ క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. తాను కాలేజీ రోజుల్లో గొప్ప కబడ్డీ ప్లేయర్‌నని జ్ఞాపకాలు నెమరువేశారు. వివాదాలకు తావు లేకుండా పోటీలు నిర్వహించాలన్నారు. అనంతరం తొలిబాల్‌ను వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు వేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఎంఎం బాలాజీ రెడ్డి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్, టీటీడీ ప్రత్యేక ఆహ్వానితులు బీరేంద్ర వర్మ, నారాయణవనం ఎంపీపీ దివాకర్ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదురై, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాల పద్మనాభం, వైఎస్‌ఆర్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి జేబీఆర్ మునిరత్నం, జిల్లా కార్యదర్శి జగదీష్ రెడ్డి, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, మోహన్, సుబ్రమణ్యం, దేశప్పన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వైఎస్సార్ సీపీ తూర్పు, రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకులు జలందకి మదన్‌మోహన్ రెడ్డి అభ్యర్థించారు. శనివారం సాంబయ్యపాలెం సచివాలయం, తొట్టంబేడు 1, 2, బసవయ్యపాలెం సచివాలయ పరిధిలోని గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జి కేతినేని వెంగళరావు ఆధ్వర్యంలో కరపత్ర ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటును పేర్నాటికి వేయాలని కోరారు. కార్యక్రమంలో తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, శ్రీకాళహస్తీశ్వర ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు భాస్కరయ్య, వెంకీ, సూరజ్, అశోక్, తీర్థరామన్ రాజశేఖర్, కిరణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్, ఎంజీఎం ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కామేష్ యాదవ్, ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. ఈ శిబిరంలో గుండె, ఎముకలు, చిన్నపిల్లలు, జనరల్ విభాగం వైద్యులు వైద్యపరీక్షలు చేస్తారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూలులో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (తిరుపతి) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ రఘు తెలిపారు. అన్ని రకాల జబ్బులను వైద్యులు పరీక్షిస్తారని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా వస్తువుల పంపిణీ

ఏర్పేడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కో–ఆర్డినేటర్ సుబోస్ చంద్రయ్య అన్నారు. శనివారం మండలంలోని మునగలపాలెం, కందాడు జెడ్పీ హైస్కూళ్లలో ప్రగతి, క్రై సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా వస్తువులను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయకుమార్ రెడ్డి, రాజవేలు, రెడ్డయ్య, ప్రగతి సంస్థ ప్రతినిధులు ప్రభాకర్, రాజేశ్వరి, కోటేశ్వరి, పద్మజ, సురేష్ పాల్గొన్నారు.

రుచికరంగా మధ్యాహ్నం భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంఈఓ రవీంద్రనాథ్ ఆదేశించారు. మండలంలో నెలవాయి గ్రామంలోని జెడ్పీ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రభుత్వ చీఫ్ విప్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ప్రభుత్వ చీఫ్ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తిసన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత బియ్యం పంపిణీ

ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య కోరారు. శనివారం ఏర్పేడులో లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. సర్పంచ్ రాజ్యలక్ష్మి, డీలర్ రవి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీలోని గ్రామాల్లో శనివారం సర్పంచ్ తాతే కాల్వ మోహనరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

- నాగలాపురం గడప గడపలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నాగలాపురం రెడ్డి వీధిలో మహిళకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలను దరిచేరుస్తూ ఆదుకుంటోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం నాగలాపురం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బజారు వీధి, గాంధి వీధి, రెడ్డి వీధి, పాట్టినాయుడు వీధి, వీకేఎం స్ట్రీట్, నటరాజుగుంట, బ్రాహ్మణ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్‌తో వివరించారు.

ఎమ్మెల్యేకు దృష్టికి సమస్యలు

నాగలాపురం–టీపీ కోట రోడ్డు అధ్వానంగా ఉందని, మంజూరైన నిధులతో త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు ఎమ్మెల్యేని కోరారు. విద్యుత్, మురుగు కాలువలు సమస్యలను నివేదించారు. పింఛన్లు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ సింధు, వైస్ ఎంపీపీ కుమారి, సర్పంచ్ సుధ, ఎంపీడీఓ పద్మజ, పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, జిల్లా సంయుక్త కార్యదర్శి జేబీఆర్ మునిరత్నం, వైఎస్‌ఆర్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్‌ఎం సురేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు పయణి రెడ్డి, పార్టీ నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, ఉదయకుమార్ రెడ్డి, మురళీ రెడ్డి, దేశప్పన్, డానియేల్, సురేష్ శెట్టి, అలగేశన్, దేశన్, మహేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిని నియమించరూ!



నాగలాపురం శ్రీ వేదనారాయణస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఆదిమూలం, సీఎండీ శ్రీధర్

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో ట్రాన్స్‌కోలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని విద్యుత్ శాఖ రాష్ట్ర సీఎండీ శ్రీధర్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శనివారం మధ్యాహ్నం నాగలాపురం, సురుటుపల్లె ఆలయాలను శ్రీధర్ సందర్శించారు. ఆయన్ను ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గంలో ట్రాన్స్‌కోలో సిబ్బంది కొరత, విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రామచంద్రాపురానికి చెందిన బండి మునిరత్నం శనివారం అనారోగ్యంతో మరణించాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.10 వేలను అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం రేపు

ఏర్పేడు: మండలంలోని మునగలపాలెం పంచాయతీ గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోదాదేవి ఉత్సవాలు ప్రారంభం

నారాయణవనం: గోదాదేవి(ఆండాళ్) నీరాటోత్సవాలు శనివారం పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామున తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారు పురవీధుల్లో విహరించారు. పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య మాట్లాడుతూ, గోదాదేవి రఘునాథస్వామిని పరిణయమాడటానికి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించారని అన్నారు. ఆమె స్తుతించిన పాశురాలు తిరుప్పావైగా ప్రసిద్ధి చెందాయని, ధనుర్మాసంలో సుప్రభాతానికి మారుగా తిరుప్పావై పాశురాలతో స్వామి వారిని మేల్కొపి నిత్య, పూజలను నిర్వహిస్తామన్నారు. వారం పాటు రోజూ ఉదయం గోదాదేవికి గ్రామోత్సవం, స్నపన తిరుమంజనాన్ని నిర్వహిస్తామని, చివరి రోజైన భోగి పండుగ రోజున అమ్మవారితో పాటు కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తారని, ఈనెల 16న గోదా కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, భద్రతాజమేదార్ విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు



తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రమేష్, ప్రవీణ్ తమ సిబ్బందితో శనివారం స్థానిక వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం, షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహం–1, 2లను సందర్శించారు. బాలికలను పరీక్షించారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు.వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, దోమల కాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, వార్డెన్లు విజయకుమారి, హేమలత, ఏఎన్‌ఎంలు సుధ, ఢిల్లీ రాణి, ఎంఎల్‌హెచ్‌పీలు లిఖిత్ కుమార్, ఇందుప్రియ పాల్గొన్నారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా తయారు చేయండి

సత్యవేడు: నియోజవర్గంలో 2023 ఓటర్ల జాబితాలో స్త్రీల ఓటర్లను బీఎల్‌ఓలు సమగ్రంగా పరిశీలించి మరో పర్యాయం ఓటర్లు జాబితా లెక్క తేల్చాలని తహసీల్దార్ టివి.సుబ్రమణ్యం ఆదేశించారు. నూతనంగా తయారు చేసిన ఓటర్లు జాబితాలో స్త్రీల ఓటర్ల పరిశీలనపై శనివారం సాయంత్రం తన కార్యాలయంలో 50 మంది బీఎల్‌ఓలతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పురుషులు 1,00,821, స్త్రీలు1,05,934 ఓటర్లుగా ఉన్నారని, ఏడు మండలాల్లో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ ఉండడంతో మరో పర్యాయం జాబితాను పరిశీలించాల్సిన అవసరం కలిగిందన్నారు. చనిపోయిన మహిళలు వారు, గ్రామం వదలి వెళ్లిన స్త్రీలు, వివాహమై అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలు, డబుల్ ఎంట్రీలను పోలింగ్ బూత్‌ల వారీగా మరోసారి కూలంకషంగా పరిశీలించి స్త్రీల ఓటర్లుపై ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, పంచాయతీ సెక్రటరీలు, మహిళా పోలీసులు, వీఆర్‌ఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీనేజర్ల ఆరోగ్యంపై శ్రద్ధ ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణి

నారాయణవనం: టీనేజ్ అమ్మాయిల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించేలా తల్లులకు అవగాహన కల్పించాలని మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శ్రావణి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సంఘమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, టీనేజర్లు రక్త హీనతకు గురవకుండా పౌష్టికాహారం పెట్టాలన్నారు. శారీరకంగా ఎదుగుదల బాగుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కిశోర దశలో గర్భం దాల్చితే ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడతారన్నారు. పడాల్సి వస్తుందని శ్రావణి పేర్కొన్నారు. ఏపీఎం మమత మాట్లాడుతూ, మైనర్ బాలికల వివాహాలను అడ్డుకోవడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయడంలో గ్రామ సమైఖ్యలు చురుకుగా ఉండాలని అన్నారు. సమావేశంలో సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

అనుబంధ ఆలయాల పరిశీలన



వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయాలైన అర్ధనారీశ్వరస్వామి ఆలయం, శ్రీప్రసన్న వరదరాజస్వామిఆలయం, ఏడుగంగమ్మల ఆలయాలను శనివారం రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. అర్ధనారీశ్వరాలయం పునర్నిర్మాణం చేసి భక్తులు సుమారు 200 మంది ఏకకాలంలో స్వామివారి అభిషేకం తిలకించేలా ముఖమండపం, గర్భాలయం, ఆలయ పరిసరాలను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని ఆలయ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఏడుగంగమ్మల ఆలయం, వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలించారు. అక్కడ పురాతన ఆలయం కావడంతో రాళ్ల పటుత్వం తగ్గిందని, వాటి స్థానంలో కొత్తరాళ్లను వినియోగించేందుకు అనుమతి ఇవ్వాలని అంజూరు కోరారు. స్థపతి కొత్తరాళ్లను వినియోగించాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. స్థపతి మాట్లాడుతూ, అన్ని ఆలయాలను అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందించామన్నారు. తిరుపతి గంగమ్మ ఆలయ నిర్మాణం రాతి కట్టడంతో అద్భుతంగా చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, పవన్, సూర్యప్రసాద్, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు స్వర్ణమూర్తి, సెన్నీరు కుప్పం శేఖర్, మొగరాల గణేష్, పులి రామచంద్ర, పాలమంగళం రవి, కంఠా ఉదయ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీసిటీ అకార్డ్ స్కూల్ వార్షికోత్సవం




వార్షికోత్సవంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన అకార్డ్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం శనివారం సాయంత్రం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడారు. పట్టణాలకు దీటుగా అన్ని వసతులతో శ్రీసిటీలో అకార్డ్ ఉండటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అకార్డ్ సంస్థల చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం ×వర్ణ ఉత్సవ్‌ పేరిట విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. షార్ ఎస్‌డీఎస్‌సీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. వెంకటరామన్, ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ గణేషన్, కన్నాభిరాన్, తమిళనాడు రాష్ట్ర ప్రణాళిక సంఘం సభ్యులు డాక్టర్ సుల్తాన్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

రేణిగుంట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులను సమాజానికి అందించవచ్చని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ అన్నారు. మండలంలో కరకంబాడి వనస్థలిలోనిరాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రేణిగుంట, తిరుపతి రూరల్ మండలాలకు చెందిన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణనిచ్చారు. ఆయన మాట్లాడుతూ, ఆధునిక సేంద్రియ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయం చేస్తే పెట్టుబడి ఖర్చు ఆదా అవడంతోపాటు ఆరోగ్యకరమైన దిగుబడులను సాధించవచ్చన్నారు. అనంతరం జీవన ఎరువులు, వేపపిండి, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, వేపనూనె మొదలైన వాటిని రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు దివ్య, రాముకుమార్ పాల్గొన్నారు.

9న కీళగరంలో గడప గడపకు



నారాయణవనం: సోమవారం మండలంలోని కీళగరం సచివాలయ పరిధిలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గుణశేఖర్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.